సాక్షి యాదాద్రి భువనగిరి

శనివారం : 12 : అక్టోబర్ : 2024



ఎంతటి త్యాగానికైనా సిద్ధం

అభివృద్ధి కోసం తన పదవిని సైతం త్యాగం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నారు. - 6లో



గీత వృత్తిని కాపాడేందుకు..

కల్లు గీత వృత్తిని కాపాడేందుకు కాటమయ్య రక్షణ కిట్లు అందజేస్తున్నట్లు శాసనమండలి చైర్మన్ పేర్కొన్నారు. - 6లో



ధాన్యం కొనేదెప్పుడో?

15 రోజుల క్రితమే వరి కోతలు మొదలై కేంద్రాలకు ధాన్యం వెల్లువలా వస్తున్నా కొనుగోళ్లు ప్రారంభించడం లేదు. - 7లో

న్యూస్‌రీల్

మంత్రి కోమటిరెడ్డి దసరా శుభాకాంక్షలు



నల్లగొండ : దసరా పండగ సందర్భంగా ప్రజలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయ దశమి తెలంగాణ ప్రజలకు అద్భుతమైన విజయాలను ప్రసాదించాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రజలందరి జీవితంలో సుఖసంతోషాలు నిండాలని.. పాడిపంటలతో తెలంగాణ విలసిల్లాలని దుర్గామాతను ప్రార్థించారు.

'త్రిఫ్ట్' డబ్బులు రూ.10కోట్లు జమ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎన్‌డీసీసీబీ మేనేజర్ శ్రీలత

చౌటుప్పల్ : నేతన్నకు చేయూత (త్రిఫ్ట్) పథకానికి సంబంధించి తమ బ్యాంకులో ప్రభుత్వం నుంచి రూ.10 కోట్లు జమ అయ్యాయని ఎన్‌డీసీసీబీ మేనేజర్ జే.శ్రీలత వెల్లడించారు. చౌటుప్పల్ బ్యాంకు కార్యాలయంలో శుక్రవారం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. బ్యాంకులో జమ అయిన నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో చేనేత, అనుబంధ కార్మిక సంఘాల ప్రతినిధులు కర్నాటి జనార్దన్, కందగట్ల కిషన్, సుంకి రవికుమార్, అందె నర్సింహ, బాల్యం అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

విజయీభవ!



భువనగిరి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



చౌటుప్పల్‌లో కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న వస్త్రదుకాణం

నేడు విజయదశమి

- ఉత్సవాలకు సిద్ధమైన ప్రజలు
- ఆయుధ, శమీ పూజలకు ఏర్పాట్లు
- సందడిగా మారిన పల్లెలు, పట్టణాలు

సాక్షి, యాదాద్రి : దసరా పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకునేందుకు జిల్లావాసులు సిద్ధమయ్యారు. శమీ, ఆయుధ పూజలకు ఏర్పాట్లు చేశారు.దుర్గాదేవిని ఆరాధించడం, ఆమెను శక్తి స్వరూపిణిగా భావించడం ఈ పండుగ ప్రత్యేకత. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమిని అనాదిగా జరుపుకుంటున్నారు.ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకు తొమ్మిది రోజులు దేవీ నవరాత్రులు నిర్వహించి పదో రోజు దసరా పండగను ప్రజలు ఘనంగా నిర్వహిస్తారు.

రహదారులపై రద్దీ

దసరా పండుగను పురస్కరించుకుని రహదారులు కిక్కిరిశాయి.హైదరాబాద్ జంటనగరాలతో పాటు వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజానీకం స్వస్థలాలకు చేరుకున్నారు. హైదరాబాద్ నుంచి చౌటుప్పల్ మీదుగా, హైదరాబాద్ నుంచి బీబీనగర్, భువనగిరి మీదుగా జిల్లాకు వేలాది మంది తరలిరావడంతో రహదారులు రద్దీగా మారాయి. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు, ద్విచక్రవాహనాలపై తరలివచ్చారు.

కొనుగోలుదారులతో మార్కెట్లు కిటకిట

దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని కొనుగోలుదారులతో మార్కెట్‌లు కిటకిటలాడాయి. ముఖ్యంగా వస్త్ర దుకాణాలు, షాపింగ్‌మాల్స్ పొద్దుపోయే వరకు కొనుగోళ్లతో కిక్కిరిసిపోయాయి. పూలు, పండ్లు, కూరగాయల మార్కెట్‌లకు కొనుగోలుదారులు పోటెత్తారు.

ఈ గ్రామాల్లో జాతీయ జెండాల ఎగురవేత

దసరా పండుగ సందర్భంగా వడపర్తి, బేగంపేట, నిధాన్‌పల్లి గ్రామాల్లో జాతీయ పతాకాలు ఎగురువేస్తారు. ఇందుకోసం ఏర్పాట్లు చేశారు.



భువనగిరి ఖిలాపై రావణ దహనం కోసం ఏర్పాట్లు

ఆయుధ, శమీ పూజ ప్రత్యేకం

మహిషాసురుణ్ని వధించడానికి దుర్గాదేవి అష్టభుజాలతో అవతరించింది. దేవతలు తమ ఆయుధాలను అందించడంతో ఆదిశక్తి మహావిరాట్ రూపాన్ని సంతరించుకుంది. ఆయుధాలను పూర్వం రాజులు అలంకరించి పూజించేవారు. ప్రస్తుతం పోలీసులు దసరా పండుగ రోజు ఆయుధ పూజ చేస్తారు. ఈ ఆచారంతోనే దసరా పండుగ రోజు జిల్లాలోని పరిశ్రమల్లో యంత్రాలు, వాహన, పనిముట్లకు పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అదే విధంగా దసరా రోజు సాయంత్రం పాలపిట్టను చూస్తే శుభం కలుగుతుందనే నమ్మకం ఉన్నది.శమీపూజ అనంతరం కిలోమీటర్ల దూరం అటవీ ప్రాంతంలోకి వెళ్లి పాలపిట్టను దర్శించుకుంటారు. శమీపూజ కోసం యాదాద్రి కొండతో పాటు భువనగిరి, చౌటుప్పల్, యాదగిరిగుట్ట, ఆలేరు, మోత్కూరు మున్సిపాలిటీల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రావణ దహనానికి రావణుడి కటౌట్‌లను సిద్ధం చేసుకున్నారు.

● జయజయహే.. మహిషాసురమర్దిని



దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రామన్నపేటలో మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన దుర్గాదేవి

నేత్రపర్వంగా ఊంజల్ సేవోత్సవం



అమ్మవారికి హారతినిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకులు.. పంచామృతాలు, వేద మంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. అనంతరం ప్రాకార మండపంలో శ్రీసుదర్శన హోమం, నిత్యకల్యాణం జరిపించారు. సాయంత్రం ప్రధాన ఆలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి అద్దాల మండపం ఊయలలో అధిష్ఠింపజేశారు. అర్చకుల వేదమంత్రాలు, మహిళా భక్తుల నీరాజనాల నడుమ ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా కొనసాగింది. ఆండాళ్ అమ్మవారికి ఇష్టమైన నాధస్వరాన్ని వినిపించారు.

సబ్ డివిజన్‌గా మోత్కూరు

- ఇన్‌స్పెక్టర్లస్థాయికి మరికొన్ని పీఎస్‌లు
- క్రైం రేటు ఆధారంగా స్థాయి పెంపు
- రాచకొండ సీపీ పరిధిలో మార్పులు
- కసరత్తు ప్రారంభించిన పోలీసు అధికారులు

సాక్షి, యాదాద్రి : జిల్లా పరిధిలో రాచకొండ పోలీస్ కమిషనరేట్ ముఖ చిత్రం మారనుంది. చౌటుప్పల్ సబ్ డివిజన్‌ను కుదించి మోత్కూరు కేంద్రంగా నూతన సబ్ డివిజన్ ఏర్పాటు చేయనున్నారు. దీంతో పాటు క్రైం రేటు అధికంగా ఉన్న మరికొన్ని పోలీస్‌స్టేషన్లను ఇన్‌స్పెక్టర్ స్థాయి స్టేషన్‌హౌజ్ ఆఫీసర్లుగా మార్చేందుకు కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే భువనగిరి రూరల్, ఆత్మకూర్ (ఎం) పోలీస్‌స్టేషన్లను ఎస్‌ఐ నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయికి అప్‌గ్రేడ్ చేసిన విషయం తెలిసిందే.

భారీగా కేసులు నమోదు, సిబ్బందిపై పెరుగుతున్న పనిభారం

రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఉన్న భువనగిరి జోన్‌లో భూ వివాదాలు, దొంగతనాలు, సైబర్ క్రైం కిడ్నాప్, చీటింగ్ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. వీటితో పాటు ఇసుక అక్రమ రవాణా, గంజాయి, మత్తు పదార్థాల రవాణా పెరుగుతోంది. అంతేకాకుండా జిల్లా పరిధిలో హైదరాబాద్ - విజయవాడ, హైదరాబాద్ - వరంగల్, జగ్‌దేవ్‌పూర్- చిట్యాల, గౌరెల్లి-వలిగొండ-కొత్తగూడెం జాతీయ రహదారులు ఉన్నాయి. నిత్యంరోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్‌జామ్‌లతో పోలీసు సిబ్బందిపై పనిభారం పెరుగుతోంది. ఈ క్రమంలో పోలీస్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం కోసం పోలీస్ స్టేషన్లను అప్‌గ్రేడ్ చేస్తున్నారు.



మోత్కూరు పోలీస్ స్టేషన్

మోత్కూరు సబ్ డివిజన్‌లో కలిసే మండలాలు

చౌటుప్పల్ ఏసీపీ పరిధిలో చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, రామన్నపేట, భూదాన్‌పోచంపల్లి, వలిగొండ, మోత్కూరు, ఆత్మకూర్(ఎం), అడ్డగూడూరు మండలాలు ఉన్నాయి. అయితే చౌటుప్పల్ సబ్‌డివిజన్ నిత్యం రద్దీగా ఉండటం, క్రైం రేట్ కూడా ఎక్కువగా ఉండడంతో మోత్కూరు కేంద్రంగా మరో సబ్ డివిజన్‌ను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. మోత్కూరు పోలీసు సబ్ డివిజన్‌కు అడ్డగూడూరు, ఆత్మకూర్(ఎం), వలిగొండ పోలీస్‌స్టేషన్లను కలిపే అవకాశం ఉంది.

రెండు స్టేషన్లు అప్‌గ్రేడ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు

బీబీనగర్, ఆత్మకూర్ (ఎం), రెండుపోలీస్ స్టేషన్లను అప్‌గ్రేడ్ చేస్తూ రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్‌ఐ నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయికి పెంచారు. ఇప్పటికే యాదగిరిగుట్ట, చౌటుప్పల్, భువనగిరి టౌన్ పోలీస్‌స్టేషన్లు ఇన్‌స్పెక్టర్ స్టేషన్ హౌజ్ అధికారి స్థాయిలో ఉన్నాయి. తాజా ఉత్తర్వులతో వాటి సంఖ్య ఐదుకు పెరిగింది.

త్వరలో మరికొన్ని స్టేషన్లు కూడా..

భువనగిరి జోన్ పరిధిలో ఎస్‌ఐలు స్టేషన్ హౌజ్ అధికారులుగా ఉన్న పోలీస్ స్టేషన్లు ఎక్కువగా ఉన్నాయి. వీటిని ఇన్‌స్పెక్టర్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయనున్నారు. వలిగొండ, ఆలేరు, మోత్కూరు, సంస్థాన్‌నారాయణపురం, భూదాన్‌పోచంపల్లి, భువనగిరి రూరల్, చౌటుప్పల్ రూరల్, యాదగిరిగుట్ట రూరల్ పోలీస్ స్టేషన్లను అప్‌గ్రేడ్ చేయడానికి పోలీసు అధికారులు లెక్కలు తీస్తున్నారు. ప్రధానంగా జాతీయ రహదారుల వెంట ఉన్న స్టేషన్లతో పాటు ఏటా 300నుంచి 400 వరకు కేసులు నమోదయ్యే స్టేషన్లను అప్‌గ్రేడ్ చేయనున్నారని సమాచారం.

250 మంది రిపోర్ట్

భువనగిరి : డీఎస్సీ-2024 ద్వారా ఎంపికైన కొత్త ఉపాధ్యాయులు డీఈఓ కార్యాలయంలో రిపోర్టు చేస్తున్నారు. 277 ఉపాధ్యాయులు పోస్టులకు గాను 252 మంది ఎంపికయ్యారు. వీరిలో 250 మంది ఉపాధ్యాయులు రిపోర్ట్ చేశారు.

అలైన్‌మెంట్ మార్పించండి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు బాధిత రైతులు

చౌటుప్పల్ : రీజినల్ రింగ్‌రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులు శుక్రవారం కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పించాలని విన్నవించారు. ఔటర్ రింగ్‌రోడ్డుకు, రీజినల్ రింగ్‌రోడ్డుకు నడుమ దూరం 40 కిలో మీటర్లు ఉండాల్సి ఉన్నప్పటికీ భువనగిరి, చౌటుప్పల్ పరిధిలో 28 కిలో మీటర్లకు కుదించారని తెలిపారు. గతంలోని అలైన్‌మెంట్ ప్రకారం చౌటుప్పల్‌లో జంక్షన్‌కు 78ఎకరాల భూసేకరణకు నిర్ణయించారని, ప్రస్తుతం రూపొందించిన డంబెల్ ఆకారం జంక్షన్‌కు 182 ఎకరాలు సేకరించేందుకు హద్దులు వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జంక్షన్ కారణంగా చౌటుప్పల్ రెండుగా విడిపోతుందని వివరించారు. మంత్రి స్పందిస్తూ ఉత్తర భాగాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసినవారిలో పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, కౌన్సిలర్ గోపగోని లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ బూరుగు కృష్ణారెడ్డి, రైతులు గుజ్జుల సురేందర్‌రెడ్డి, ఏసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, దబ్బేటి రాములు, సందగళ్ల మల్లేష్, జాల శ్రీశైలం, బోరెం ప్రకాష్‌రెడ్డి, జాల వెంకటేష్, నాగెళ్లి దశరథ, బొమ్మిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, ఏసిరెడ్డి దామోధర్‌రెడ్డి, వల్లూరి బోవయ్య, వెంకటేష్, రమేష్, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీలు వస్తున్నాయ్

వారం రోజుల్లో నియామకం

- మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం
- ఒక్కో కమిటీలో ఏడుగురు సభ్యులు
- లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరగకుండా పర్యవేక్షణ

రామన్నపేట : నిరుపేదల సొంతింటి కలసాకారం కానుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి దశలో ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేయనుంది. ఒక్కో ఇంటి నిర్మాణానికి గాను లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తుంది. లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరగకుండా పర్యవేక్షించేందుకు ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని సంకల్పించింది. కమిటీల ఏర్పాటుకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రకటిస్తూ శుక్రవారం ప్రభుత్వ కార్యదర్శి జీఓ 33 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు.

మార్గదర్శకాలు

ఇందిరమ్మ కమిటీల్లో ఏడుగురు చొప్పున సభ్యులు ఉంటారు. ఇందులో గ్రామ పంచాయతీ కమిటీలో సర్పంచ్ లేదా పంచాయతీ ప్రత్యేకాధికారి, స్వయం సహాయక సంఘాలకు చెందిన ఇద్దరు మహిళలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఆసక్తిగల ముగ్గురు స్థానికులు (బీసీ, ఎస్సీ, ఎస్టీ), పంచాయతీ కార్యదర్శి ఉంటారు. ఇక మున్సిపాలిటీ స్థాయి కమిటీలో వార్డు కౌన్సిలర్ లేదా కార్పొరేటర్, స్వయం సహాయక సంఘాలకు చెందిన ఇద్దరు మహిళలు, అభివృద్ధి పనులపై ఆసక్తి గల ముగ్గురు స్థానికులు (బీసీ, ఎస్సీ,ఎస్టీ), వార్డు అధికారి సభ్యులుగా ఉంటారు.



జిల్లాలో 530 కమిటీలు

యాదాద్రి జిల్లాలో 426 గ్రామ పంచాయతీలు, ఆరు మున్సిపాలిటీలు ఉన్నాయి. మున్సిపాలిటీల్లో 104 వార్డులున్నాయి. మొత్తం 530 కమిటీలను ఎంపిక చేయనున్నారు. ఇంచార్జ్ మంత్రితో కలెక్టర్ సంప్రదింపులు జరిపిన అనంతరం కమిటీలు ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేస్తారు. ఆ తరువాత కమిటీ సభ్యులకు విధివిధానాలపై అవగాహన కల్పిస్తారు.

ఇవీ.. కమిటీల బాధ్యతలు

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ప్రజలకు అవగాహన కల్పించాలి.
- లబ్ధిదారులను గుర్తించాలి. అర్హులను మాత్రమే జాబితాలో చేర్చాలి.
- గృహ సంబంధిత సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి.
- గ్రామ పంచాయతీ కమిటీ సభ్యులు లబ్ధిదారుల పేర్లను ఎంపీడీఓకు, మున్సిపల్ వార్డు కమిటీ సభ్యులు మున్సిపల్ కమిషనర్‌కు సూచించాలి.
- క్షేత్రస్థాయికి వెళ్లి విచారణచేసిన తరువాతే లబ్ధిదారులను గుర్తించాల్సి ఉంటుంది.

గీత వృత్తిని కాపాడేందుకు రక్షణ కిట్లు

- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి


గీత కార్మికులకు రక్షణ కిట్లు అందజేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్: కల్లు గీత వృత్తిని కాపాడేందుకు వారికి కాటమయ్య రక్షణ కిట్లు అందజేస్తున్నట్లు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. బీసీ, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా మొదటి విడతలో భాగంగా 208 మంది గీత కార్మికులకు శుక్రవారం నకిరేకల్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో రక్షణ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాటి చెట్టు పైనుంచి పడి ప్రమాదాల బారిన వారికి నెల లోపే ఎక్స్‌గ్రేషియా అందేలా సీఎం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. మిగిలిన కార్మికులకు రెండవ విడతలో రక్షణ కిట్లు అందజేస్తామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌లు ఆలోచన చేసి గీత కార్మికులను ప్రమాదాల బారి నుంచి రక్షించాలని కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టారన్నారు. ప్రతి గీత కార్మికుడికి రక్షణ కిట్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో యాదాద్రి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి రమేష్, ఎక్సైజ్ సీఐ మల్లయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ చౌగోని రజిత, వైస్ చైర్ పర్సన్ ఉమారాణి, బీసీ ఫైనాన్స్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య, మేనిఫెస్టో మెంబర్ చామల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ గాజుల సుకన్య, కల్లుగీత సంఘం అధ్యక్షుడు జానయ్యగౌడ్, మాజీ జెడ్పీటీసీ యాదగిరి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధం

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి


గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

మునుగోడు: నియోజకవర్గ అభివృద్ధి కోసం తన పదవిని సైతం త్యాగం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. మునుగోడు మండలంలోని కల్వకుంట్ల గ్రామంలో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవనానికి శుక్రవారం ఆయన శంస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ.. ప్రభుత్వం నూతనంగా చేపట్టిన గురుకుల పాఠశాల భవనాల నిర్మాణానికి సంబంధించి మొదటి లిస్టులో మునుగోడు నియోజకవర్గం లేకపోవడంతో సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వెంకట్‌రెడ్డిలను ఒప్పించి పాఠశాలను మంజూరు చేయించినట్లు చెప్పారు. ప్రతి ఒక్క అభివృద్ధి పనికి నిధులు మంజూరు చేయించి రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు శాయశక్తుల కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో బెల్టు దుకాణాలను మూసివేయిస్తున్నామని, అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, అదనపు కలెక్టర్ పూర్ణచందర్‌రావు, చండూరు ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, డీసీఓ మురళి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నారబోయిన రవి ముదిరాజ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్‌నేత, మాజీ జెడ్పీటీసీలు చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, పాశం సురేందర్ రెడ్డి, వీరమళ్ల భానుమతివెంకటేష్, మాజీ ఎంపీపీలు కర్నాటి స్వామి, తాడూరి వెంకట్ రెడ్డి, నాయకులు పోలగొని సత్యం గౌడ్, జాజుల అంజయ్య గౌడ్, భీమనపల్లి సైదులు, జాల వెంకన్న యాదవ్, వేమిరెడ్డి జితెందర్ రెడ్డి, మందుల బీరప్ప పాల్గొన్నారు.

ఎస్‌ఐ చేయూత

- ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన దంపతులు

బొమ్మలరామారం: స్థానిక ఎస్‌ఐ శ్రీశైలం చేయూతతో నిరుపేద దంపతులిద్దరూ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఈమేరకు తమకు వెన్నంటి ఉన్న ఎస్‌ఐను శుక్రవారం కలిసి కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. జగదేవ్‌పూర్‌కు చెందిన నిరుపేద దంపతులు సిరిసిల్ల బాలయ్య- శ్రీలత రోజువారీ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. విద్యావంతులై ఉండి, మంచి ప్రతిభ ఉన్నా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. విషయం తెలుసుకున్న అప్పటి ఎస్‌ఐ శ్రీశైలం వారికి అండగా నిలిచారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు సహాయ సహకారాలు అందించారు. ఈక్రమంలో ఈ నెల 8న వెల్లడించిన డీఎస్సీ ఫలితాల్లో బాలయ్య, శ్రీలత దంపతులిద్దరూ ఎస్‌జీటీ ఉద్యోగాలు సాధించారు. తమను ప్రోత్సహించిన ఎస్‌ఐ శ్రీశైలంను శుక్రవారం బొమ్మలరామారం పోలీస్‌స్టేషన్‌లో కలిసి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.


ఎస్సై శ్రీశైలంను సన్మానిస్తున్న బాలయ్య, శ్రీలత

14న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ


మాట్లాడుతున్న తాళ్లపల్లి రవి

నల్లగొండ : ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ ఈ నెల 14న నల్లగొండలో ఏర్పాటు చేసినట్లు ఆ సమితి రాష్ట్ర కో కన్వీనర్ తాళ్లపల్లి రవి తెలిపారు. శుక్రవారం నల్లగొండలోని మాల మహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర చైర్మన్ జి చెన్నయ్య తెలిపారు. ఈ సభకు మాలలు, మాల ఉద్యోగులు, యువకులు, అంబేద్కర్‌వాదులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా చైర్మన్ లకుమాల మధుబాబు, నాయకులు ఎన్నమల్ల అనిల్, నాగటి జోసఫ్, చింతపల్లి బాలకృష్ణ, నామ చక్రవర్తి, అన్నిమల్ల డిండి ప్రసాద్, అన్నిమల్ల లింగస్వామి, రొయ్య కిరణ్‌కుమార్, ముడుసు భిక్షం, బాబు పాల్గొన్నారు.

రామలింగేశ్వరాలయంలో కొనసాగుతున్న శరన్నవరాత్రోత్సవాలు


కుంకుమార్చన నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం తొమ్మిదవ రోజు అమ్మవారు మహిషాసుర మర్దిని అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చింది. అర్చకులు ప్రాతఃకాల పూజ, స్థాపితదేవత హవనం, అర్చనలు, పారాయణములు, గాయత్రీ జపములు, లలిత సహస్రనామార్చన, మధ్యాహ్న పూజ నిర్వహించారు. అనంతరం సాయంత్రం వేళ శ్రీదేవీ చతుష్షష్టి ఉపచార పూజ, సహస్రనామార్చన, నీరాజనం జరిపించి తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు.

14న బుద్ధవనంలో ధమ్మ విజయం వేడుకలు

నాగార్జునసాగర్ : బుద్ధవనంలో ఈ నెల 14వ తేదీన ధమ్మ విజయం వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, బుద్ధవనం ప్రత్యేకాధికారి ఎస్.ప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. సికింద్రాబాద్ మహేంద్రాహిల్స్‌లోని మహాబోధి బుద్ధవిహార్, మైసూర్ బైలకుప్పెలోని సెరా బుద్ధవిహారం నుంచి వచ్చే బౌద్ధాచార్యుల సమక్షంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అధ్యక్షత వహిస్తారని తెలిపారు. ఈ వేడుకలకు అందరూ ఆహ్వానితులేనని పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్, ఆయిల్ చోరీ

వలిగొండ: వలిగొండ మండలంలోని ఎదుళ్లగూడెం గ్రామ పరిధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్, ఆయిల్ చోరీకి గురైంది. శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎదుళ్లగూడెం నుంచి చైతన్యపురికి వెళ్లే రోడ్డు సమీపంలో బండిగారి మైసయ్య అనే రైతు ఏర్పాటు చేసుకున్న 25 కేవీఏ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ లోని కాపర్ వైరుతోపాటు ఆయిల్ గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. గురువారం గమనించిన రైతు వలిగొండ ట్రాన్స్ కో ఏఈ మచ్చేందర్ సమాచారం అందించాడు. శుక్రవారం ఆయన ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యుగందర్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

- మా వద్ద BA లో తెలుగు, హిందీ Lit కొరకు ఓపెన్ 10th, ఇంటర్, డిగ్రీ, పి.జి, MBA, B.Tech, LLB, ITI డిప్లమా, ఫార్మసీ, B.Ed, B.PEd. అ.కై. సంప్ర॥ 9948131154. కోదాడ. [Y-1124891]

Real Estate

PLOT FOR SALE

- గజం 2500/- నార్కెట్‌పల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటి వెంచర్‌లో స్విమ్మింగ్‌పూల్, కాటేజి, 30 పండ్ల మొక్కలు 30 ఎర్రచందనం మొక్కలతో 5 &10 గుంటల ప్లాట్స్ అమ్మబడును. దసరా ఆఫర్ 10 గ్రా॥ గోల్డ్ కలదు. సంప్ర: 6304222202 [G-3174]
- SRM డ్రీమ్ సిటి DTCP వెంచర్ చర్లపల్లి నల్లగొండ మున్సిపాలిటి నందు 33x45=165 గజాల పడమర ఫేస్ ప్లాటు అమ్మబడును. ధర గజానికి 8000/- సంప్ర॥ 9666666762 [Y-1124883]
- చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో 14000 చ॥గ॥ HMDA & RERA Approved లేఅవుట్ ఓపెన్ ప్లాట్స్. బ్యాంక్ లోన్ సదుపాయం. 6309527694 [SCA24000367]

HOUSE FOR SALE

- Independent House 150 Sq.yds, G+1, 4 Bed Rooms At Nandihills Colony, Near Bommalagudi, Hayathnagar. Rs. 94 Lacks. Ph: 9866424722, 9392090953. [HA-14848]

Wanted

- రెడీమెడ్ బట్టల షాపులోకి వర్కర్స్ కావలెను. పర్మినెంట్ & టెంపరరీ, కీర్తి క్రియేషన్స్, ప్రకాశం బజార్, నల్లగొండ. సంప్ర॥ 9247272429 [Y-1124896]
- ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను పిల్లలను చూసుకొనుటకు ఇంటి/వంట పనికి వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 20K. Ph: 8977639662, 8977639663 [H-796283]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.